

ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న యువతులు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, మే 30(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్ శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్, లక్నో చికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి టాయ్స్ ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి చేయండి: రాగుల

వనస్థలిపురం, మే 30(ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్‌ల సహకారంతో కృషి చేస్తున్నానని తెలిపారు. ఇతర సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి సీతక్కను కోరినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలాజీనగర్ పార్కును ఉపయోగించుకోవాలి

హయత్‌నగర్, మే 30(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్, కేవీఎస్‌రెడ్డి కాలనీల మధ్యలో జీహెచ్‌ఎంసీ కొత్తగా నిర్మించిన పార్కును అందుబాటులోకి తీసుకువచ్చారు. శుక్రవారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్థానిక కాలనీవాసులతో కలిసి కొత్త పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు చుట్టు వీధిలైట్లు, నీటి గుంతలను ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. ఓపెన్ జిమ్ కింద రబ్బరు ఫ్లోర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. బాలాజీనగర్‌లో పెద్ద పబ్లిక్ పార్కు ఏర్పాటు చేసినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్కును ప్రజలంతా ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీల సంక్షేమ సంఘం నాయకులు మోహన్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, రంగారెడ్డి, సౌరయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సిబ్బందిని సన్మానిస్తున్న జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా, అధికారులు

జైలు సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

సైదాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడలోని జైళ్లశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో ఉద్యోగ విరమణ చేసిన మహిళా కారాగారం డిప్యూటీ జైలర్ ప్రమీలాబాయి, కరీంనగర్ జిల్లా జైలు జూనియర్ అసిస్టెంట్ సమ్మయ్యను జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా సన్మానించారు. ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి విరమణ అనివార్యమన్నారు. ఎన్నో సవాళ్లతో కూడుకుని ఉన్న జైళ్లశాఖ ఉద్యోగం సంపూర్ణంగా పూర్తి చేసి విరమణ పొందడం గొప్ప విషయమన్నారు. అనంతరం సంక్షేమ నిధి చెక్కులను వారికి అందజేశారు. కార్యక్రమంలో జైళ్లశాఖ ఐజీలు వై.రాజేష్, మురళీబాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, అధికారులు శ్రీమాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కాలనీల అభివృద్ధి: కార్పొరేటర్

చంపాపేట, మే 30(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ఆయా కాలనీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని మల్‌రెడ్డి రంగారెడ్డినగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులను సకాలంలో నాణ్యతగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సీసీ రోడ్డు పనులను వాల్ టూ వాల్ చేపట్టాలని, ఇళ్ల ముందు ఉన్న మెట్లు, ర్యాంపులను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కాలనీవాసులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సురేష్, కాలనీ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు భూపతిరెడ్డి, సత్తయ్య, కృష్ణయ్య, రామ్‌నివాస్ పాల్గొన్నారు.

సాయికృష్ణనగర్‌లో కార్పొరేటర్ మార్నింగ్‌వాక్

ఎల్బీనగర్, మే 30(ఆంధ్రజ్యోతి): మార్నింగ్‌వాక్‌లో సమస్యల గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ తెలిపారు. శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయికృష్ణనగర్‌లో సరూర్‌నగర్ ఉప కమిషనర్ సుజాత శ్రీధర్‌తో కలిసి మార్నింగ్‌వాక్ చేశారు. కాలనీవాసులతో మాట్లాడి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ రోడ్లపై నిర్మాణ వ్యర్థాలను పడేసేవారికి జరిమానా విధించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో జలమండలి డీజీఎం సన్యాసిరావు, శానిటేషన్ డీఈ చందన, ఇంజనీరింగ్ విభాగం ఏఈ ప్రశాంతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిన్నారులకు ఆటల పోటీలు

సైదాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణా శిబిరాలు ముగింపు సందర్భంగా చంపాపేటలోని జీఎస్ఆర్ బ్యాడ్మింటన్ అకాడమీలో చిన్నారులకు స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ అంశాలలో నిర్వహించిన పోటీలు ఉత్సాహంగా శుక్రవారం ముగిసాయి. విజేతలకు నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి, కోచ్ అబ్దుల్ కుదూస్ పతకాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే తమ అకాడమీలో చిన్నారులకు శిక్షణ, పోటీలు నిర్వహించామని తెలిపారు. చిన్నారులకు ఆసక్తి గల అంశాలలో తగిన ప్రోత్సాహంతో కూడిన శిక్షణ ఇస్తే ఆయా రంగాలలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లలో తిరంగా యాత్ర

- పాల్గొన్న ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, కొండా తదితరులు

సరూర్‌నగర్, మే 30(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శుక్రవారం రాత్రి మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. అటు బడంగ్‌పేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి, ఇటు మీర్‌పేట్‌లోని లెనిన్‌నగర్ వాటర్ ట్యాంకు నుంచి యాత్ర ప్రారంభించి బాలాపూర్ చౌరస్తా వరకు కొనసాగించారు. ఆయా కార్పొరేషన్ల బీజేపీ అధ్యక్షులు పసునూరి భిక్షపతిచారి, తులసి ముఖేశ్‌ముదిరాజ్, రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని, వీర జవాన్లకు సంఘీభావంగా నినాదాలు చేస్తూ జైభారత్.. జై మోదీ నినాదాలతో హోరెత్తించారు. పార్టీ నాయకులు టీవీరేందర్‌గౌడ్, యెల్మేటి దేవేందర్‌రెడ్డి, కొలన్ శంకర్‌రెడ్డి, బొక్క నర్సింహారెడ్డి, నడికుడ యాదగిరి, గుర్రం మల్లారెడ్డి, సామ సంజీవరెడ్డి, సీహెచ్ వెంకట్‌రెడ్డి, శూరకర్ణారెడ్డి, రవినాయక్, మద్ది రాజశేఖర్‌రెడ్డి, గడ్డం వెంకటేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో భారతీయుల్లో పెరిగిన ఐక్యత: లక్ష్మణ్

పాక్ కుట్రలను పసిగట్టి ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ భారతీయుల్లో ఐక్యమత్యాన్ని పెంపొందించిందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. తిరంగా యాత్రను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పాక్ ప్రేరేపిత ఉగ్రమూలాలను ధ్వంసం చేసే ఏకైక లక్ష్యంతో చేపట్టిన ఆపరేషన్ సిందూర్ మోదీ చాతుర్యానికి, భారత ఆర్మీ ధీరత్వానికి నిదర్శనమని అన్నారు. భారత్ చర్యతో శత్రు దేశాల వెన్నులో వణుకుపుట్టిందని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీలకతీతంగా, వర్గాలకతీతంగా ప్రతి ఒక్కరూ వీర జవాన్లకు సంఘీభావంగా నిలవాల్సిన అవసరం ఉన్నదని డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు.



తిరంగా యాత్రలో పాల్గొన్న ఎంపీలు లక్ష్మణ్, కొండా, అందెల తదితరులు

బక్రీద్ సందర్భంగా పటిష్టమైన బందోబస్తు : ఏసీపీ

చాదర్‌ఘాట్, మే 30(ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను పురస్కరించుకుని మలక్‌పేట డివిజన్ పరిధిలోని మలక్‌పేట, చాదర్‌ఘాట్, డబీర్‌పుర పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డివిజన్ ఏసీపీ సుబ్బరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సౌత్ ఈస్ట్ జోన్ శాంతి సంక్షేమ సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ఇప్పటికే రెండు పోలీస్ పికెట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసారాంబాగ్ చౌరస్తాలో, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చాదర్‌ఘాట్‌లో ప్రత్యేక పికెట్లను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. వీటితో పాటు సున్నితమైన, అతిసున్నితమైన, సమస్యాత్మకమైన ప్రాంతాల్లో కూడా సాయుధ పోలీస్ పికెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. బక్రీద్ పర్వదినాన్ని శాంతి యుత వాతావరణంలో జరుపుకోవడంలో అన్ని వర్గాల ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సౌత్ ఈస్ట్ జోన్ శాంతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ కులాలు, మతాలకు అతీతంగా శాంతి సంక్షేమ సంఘం సభ్యులు పోలీసులతో కలిసి తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారని తెలిపారు.



సమావేశంలో ఏసీపీ సుబ్బరామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు నరేష్, మురారి, శంకర్

రేపటి నుంచి రేషన్ షాపుల్లో ఒకేసారి

మూడు నెలల సన్న బియ్యం పంపిణీ

సరూర్‌నగర్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే సన్న బియ్యం ఈసారి మూడు నెలలకు కలిపి ఒకే నెలలో ఇవ్వనున్నారు. ఈ మేరకు సివిల్ సప్లయిస్ విభాగం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాలాపూర్ మండలంలోని షాపులన్నింటికీ బియ్యం సరఫరా కూడా జరిగింది. గతంలో ఏ నెలకానెల బియ్యం పంపిణీ జరిగేది. అయితే ఈ సారి మాత్రం ఒకే నెలలో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. జూన్ నెలలోని అన్ని రోజుల్లో రేషన్ షాపులు తెరిచి ఉంచుతారు. ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, తిరి గి సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు రేషన్ షాపులు పని చేయనున్నాయి. బాలాపూర్ మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన రేషన్ బియ్యం షాపులకు వచ్చిందని, బియ్యం అందుబాటులో ఉంచి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు టేకుల శశిధర్‌రెడ్డి చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తిరిగి సెప్టెంబరులో సన్న బియ్యం పంపిణీ ఉంటుందని ఆయన చెప్పారు.



రేషన్ షాపు

గోవుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టండి

సైదాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను పురస్కరించుకుని గోవుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ బీజేపీ నేతలు శుక్రవారం సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. గోవులను నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాలు, గ్రామాలు, సంతలు నుంచి భారీ ఎత్తున తరలించనున్నారని పేర్కొన్నారు. గోవుల అక్రమ రవాణా నియంత్రణకు మరిన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని కోరారు. గోరక్షణ చట్టాలను అమలు చేయాలని, గోవులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గోశాల చైర్మన్ సహదేవ్‌యాదవ్, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, నేతలు నర్సింహ, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఉగాది మహేష్, చందు, మహేశ్ పాల్గొన్నారు.



డీసీపీ కాంతిలాల్ పాటిల్‌కి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

సాయినగర్ గ్రామ పంచాయతీ రికార్డుల స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 28(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్ గ్రామ పరిధిలోని సాయినగర్ గ్రామ పంచాయతీ రికార్డులను శుక్రవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిని అనుకుని ఉన్న సాయినగర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి ఆ గ్రామ పంచాయతీకి వెళ్లి పంచాయతీ అధికారుల నుంచి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి వార్డు కార్యాలయంగా బోర్డును ఏర్పాటు చేశారు. నేటి నుంచి సాయినగర్ మున్సిపాలిటీ ఆధీనంలోనే ఉంటుందని కమిషనర్ తెలిపారు. కొత్తగా విలీనం అయిన సాయినగర్‌తో కలిసి మున్సిపాలిటీలో 9 గ్రామాలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

నేడు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి దామోదర్ ఉద్యోగ విరమణ



ఓల్డ్‌మలక్‌పేట : మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసా య మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న మిద్దె దామోదర్ శనివారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఆయన 38 సంవత్సరాలుగా పలు జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం మలక్‌పేటలోని మార్కెట్ విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్నారు.

మురుగు పొంగింది.. ట్రాఫిక్ ఆగింది!

- రాత్రి వేళ మరమ్మతు.. రాకపోకలకు అంతరాయం

ఓల్డ్‌మలక్‌పేట: హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి- 65పై పాతమలక్‌పేట వద్ద శుక్రవారం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అక్బర్ ప్లాజా ముందు మ్యాన్‌హోల్ పగిలి మురుగు నీరు రోడ్డుపై ఏరులై పారడంతో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. ఉదయం తాత్కాలికంగా మరమ్మతు చేసిన వాటర్‌బోర్డు అధికారులు రాత్రి జెట్టింగ్ మిషన్లతో అక్కడకు చేరుకుని పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు ప్రారంభించారు. గంటన్నరకుపైగా సమయం పట్టడం.. ఇరుకుగా ఉన్న రోడ్డుపై జెట్టింగ్ వాహనాలు నిలపడంతో మరోసారి ట్రాఫిక్ జామ్ అయ్యింది. చాదర్‌ఘాట్ వైపు నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే క్రమంలో మలక్‌పేట వద్ద అరకిలోమీటర్ దూరానికి దాదాపు అరగం ట సమయం పట్టింది. దీంతో ఆ రోడ్డులో వెళ్లాల్సిన వారు ప్రత్యామ్నాయ మార్గా ల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఈ ప్రాంతంలో తరచూ మురుగు పొంగి పొర్లుతుందని, పూర్తి స్థాయి పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



మ్యాన్‌హోల్ పగిలిపోయి రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

వృద్ధురాలి అదృశ్యం

సైదాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాదన్నపేటలో నివాసముండు శశికళ(70) ఈనెల 27న ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతికారు. ఫలితం లేకపోవడంతో మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సరూర్‌నగర్ సర్కిల్ ఎస్‌ఈగా లక్ష్మీనారాయణకు అదనపు బాధ్యతలు



హైదరాబాద్ సిటీ, మే 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయంలో కన్‌స్ట్రక్షన్ సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ) బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.లక్ష్మీ నారాయణకు సరూర్‌నగర్ సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించా రు. లక్ష్మీనారాయణ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టి సర్కిల్‌పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్‌సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు, సిబ్బంది 24గంటలు విధుల్లో ఉండాలని ఆదేశించారు.

ఘనంగా మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు

మన్సూరాబాద్ : రాష్ట్ర ఐటీ, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు శుక్రవారం తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి, శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్తాధ్వర్యంలో ఎల్బీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు కేక్‌ను కట్ చేసి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు చెన్నూరు లక్ష్మీనరసింహారావు, దేవులపల్లి రంగారావు, డి.అశోక్‌కుమార్, కరకంపట్ల రామారావు పాల్గొన్నారు.

ఘనంగా నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మన్సూరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ వర్ధానగర్‌కాలనీలో గల నల్లపోచమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలకు డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డిలు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో అత్తాపురం రాంచంద్రారెడ్డి, చంద్రారెడ్డి, ఎస్.నర్సింహగౌడ్, చెంగల్ చంద్రమోహన్, అరుణ్‌బాబు యాదవ్, భక్తులు పాల్గొన్నారు.

నేడు తెప్ప పూజ, రేపు కల్యాణం

నల్లపోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శనివారం గంగా తెప్పపూజ, ఆదివారం అమ్మవారి కల్యాణం నిర్వహించనున్నట్లు కమిటీ పేర్కొంది.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ఓల్డ్‌మలక్‌పేట: ఓల్డ్‌మలక్‌పేటలోని మున్సిపల్ కాలనీలో కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు, భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ చైర్మన్ ఉమ్మారెడ్డి ఆధ్వర్యంలో వార్షికోత్సవ ఏర్పాట్లు, పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రతి సంవత్సరం స్వామివారి వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతాయని స్వామి వారిని భక్తులు కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని చైర్మన్ తెలిపారు. పూజాకార్యక్రమాల అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ ఈఓ రాజన్, మార్తాండ పోచమ్మ ఆలయ ట్రస్టీ కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, కృపాకర్‌రెడ్డి, రామకృష్ణ, రాజేశ్, రజిని, జయంతి, లక్ష్మిదేవి, అరుంధతి పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణంలో భక్తులు

స్నేహపురి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

- ఆదివారం నుంచి శుక్రవారం వరకు

కొత్తపేట, మే 30(ఆంధ్రజ్యోతి): కొత్తపేట స్నేహపురి కాలనీలో వెలసిన పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు జూన్ 1వ తేదీ(ఆదివారం) నుంచి 6వ తేదీ(శుక్రవారం) వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి తెలిపింది. 26 సంవత్సరాల క్రితం 1999 సంవత్సరం జ్యేష్ఠమాసం చిత్తా నక్షత్రం రోజు పుష్పగిరి పీఠాధిపతులు విద్యానృసింహభారతీ తీర్థమహాస్వామి స్నేహపురికాలనీలో శాస్త్రోక్తంగా వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాటి నుంచి ఆలయంలో పవిత్ర ధనుర్మాస, శ్రావణ, కార్తీక మాసాల్లో విశేష అర్చన, అభిషేక, పూజాకార్యక్రమాలు, హోమాలు, వ్రతాలు కొనసాగుతున్నాయి. ఏటా ధర్మకర్తల మండలి వారు సందర్భానుసారం ఆలయంలో శ్రీనివాస కల్యాణ వేదికపై ఆధ్యాత్మిక, భక్తి పూర్వక, శాస్త్రీయ సంగీత, సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామి వారి కీర్తనల గానం, శాస్త్రీయ నృత్య రూపకాల ప్రదర్శనలను నిర్వహిస్తున్నారు. ప్రధాన ఆలయంలో వేంకటేశ్వరస్వామి మూలవిరాట్టు, ఇరువైపులా పద్మావతి అమ్మవారు, గోదాదేవి అమ్మవారు దర్శనమిస్తారు. ప్రాంగణంలో విజయగణపతి, ప్రసన్నాంజనేయ, విశాలాక్షి, అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వనాథస్వామి, అయ్యప్పస్వామి ఉపాలయాలు ఉన్నాయి. భక్తులు ప్రత్యేకంగా సంప్రదాయబద్ధంగా ఉపనయనాలు, తదితర కార్యక్రమాలు, గణపతి, రుద్ర, మన్యుసూక్త హోమాలు, వ్రతాలు, స్వామివార్ల కల్యాణోత్సవాలు చేయించుకునే వీలుంది.



స్నేహపురి పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి

వార్షిక బ్రహ్మోత్సవాల్లో..

ఏటా జ్యేష్ఠమాసంలో ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. జూన్ 1వ తేదీ నుంచి ఆరంభమయ్యే పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు 6వ తేదీ వరకు కొనసాగుతాయి. 1వ తేదీ సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, తిరువీధి ఉత్సవం, 2న ఉదయం ధ్వజారోహణ, సంతానార్థులకు గరుడ ప్రసాద వితరణ, 3న హనుమద్వాహనసేవ, 4న ఉదయం శ్రీవారి కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం గరుడవాహన సేవ, 5వ తేదీన చంద్రప్రభవాహనసేవ, 6న అష్టోత్తర శత కలశ స్నపనం, చక్రస్నానం, పుష్పయాగార్చన నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.